ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలోనే ప్రథమం


నకిరేకల్: చీమలగడ్డ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ట్రక్‌షీట్‌లను పరిశీలిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎంసీఎస్ హరీశ్

నకిరేకల్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, వేగంగా ప్రక్రియను చేపట్టడంలో రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉందని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు చెప్పారు. నకిరేకల్ చీమలగడ్డలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 285 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. వీటిల్లో 70 కేంద్రాలను సన్నరకాల కొనుగోలుకు కేటాయించామన్నారు. రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా జిల్లాలో ఎనిమిది ప్రాంతాల్లో గోదాములను గుర్తించామన్నారు. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇక్కడే నిల్వ చేస్తున్నామన్నారు. కనగల్‌లోని ఏఎంసీ గోదాముల్లోకి పదివేల క్వింటాళ్ల ధాన్యం తరలించామన్నారు. వర్షం రాకను గంట ముందుగానే తెలుసుకునే యాప్‌ను కేంద్రాల ఇన్‌ఛార్జిలను అందుబాటులోకి తెచ్చామని, దీని వల్ల ధాన్యం తడవకుండా రైతులు ముందుగానే ఏర్పాట్లు చేసుకునే వీలుందన్నారు. పౌరసరఫరాల శాఖ డీఎం హరీశ్, నకిరేకల్ డీటీసీఎస్ జ్యోతి, కేంద్రం ఇన్‌ఛార్జి నాగరాజు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి: డీఎంహెచ్‌వో

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో దేవరకొండ డివిజన్ పరిధిలోని వైద్య అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలపై అవగాహన కల్పించాలని.. సాధారణ ప్రసవాల సంఖ్య మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు అరుంధతి, కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.



అడుగడుగునా కూడళ్లు.. కొన్నింటికే దిద్దుబాట్లు

❑ మరిన్నీ అండర్‌పాస్ వంతెనల నిర్మాణానికి ప్రజల వేడుకోలు

చౌటుప్పల్(గ్రామీణం, న్యూస్‌టుడే:

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65పై తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతా(బ్లాక్ స్పాట్స్)లలో అండర్‌పాస్ వంతెనలు, సర్వీసు రోడ్డు పనులు జాతీయ ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. రూ.282 కోట్లకు టెండర్ దక్కించుకున్న హరియాణాకు చెందిన రామ్‌కుమార్ సంస్థ ఈ పనులు చేపడుతోంది. ఇక్కడే కాకుండా.. ఇంకొన్ని ప్రాంతాల్లోనూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా చోట్ల అండర్‌పాస్ వంతెనలు లేక జాతీయ రహదారి దాటే సమయంలో పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వాటిల్లోనూ అండర్‌పాస్ వంతెనలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించకపోవడంతోనే సమస్య ఏర్పడిందని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లలో మొదలైన పనులు

యాదాద్రిభువనగిరి జిల్లాలోని దండుమల్కాపురం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ వరకు 181.5 కిలోమీటర్ల దూరంలో 17 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు అధికారులు గుర్తించారు. ఏడాదిన్నరలో పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సంస్థను ఆదేశించింది. ప్రస్తుతం చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల, ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీకళాశాల-జనగామ కూడలి, జమ్మిగడ్డ కూడలి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కోమరబండ, కోదాడ, శ్రీరంగాపురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల చెట్లు కొట్టేశారు.

★ కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), దురాజ్‌పల్లి, నవాబుపేట(ఏపీ) వద్ద పనులను ప్రారంభించాల్సి ఉంది.

ఇక్కడ అండర్‌పాస్‌లు అత్యవసరం

◆ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం పారిశ్రామిక పార్కు ఎదుట అండర్‌పాస్ వంతెన అత్యవసరం. ఈ పార్కులో ఇప్పటికే వందకు పైగా పరిశ్రమలు ప్రారంభం కావడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. రాబోయే రోజుల్లో మరిన్నీ పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయి. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఎదురుగా.. పార్కు నుంచి వచ్చే వాహనాలు టెక్స్‌టైల్ పార్కు ముందు నుంచి వ్యతిరేక మార్గంలో వస్తున్నాయి. పార్కు ఎదురుగానే ఆందోల్ మైసమ్మ దేవాలయానికి వచ్చే భక్తుల వాహనాలు విజయవాడ మార్గంలో అపసవ్య దిశలో ప్రయాణిస్తున్నాయి. ఆదివారం భక్తుల రద్దీ ఉంటుంది. ఇక్కడ అండర్‌పాస్ వంతెన నిర్మిస్తే వాహనదారులు, భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.

◆ చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం, అంకిరెడ్డిగూడెం స్టేజీ, పంతంగి స్టేజీ నుంచి ఆరెగూడెం స్టేజీ వరకు అండర్‌పాస్‌లు అవసరం. ఈ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు విడిచారు. పంతంగి గ్రామస్థులు కూడా ప్రజాప్రతినిధులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

◆ చిట్యాల మండలం పిట్టంపల్లి, వట్టిమర్తి, నార్కట్‌పల్లి మండలంలోని గోపాలయపల్లి శ్రీ వేణుగోపాలస్వామి కమాన్, కట్టంగూరు పట్టణం, నకిరేకల్ బైపాస్ ముందు పద్మానగర్ జంక్షన్, అయిటిపాముల వద్ద కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనలను నిర్మిస్తేనే సమస్యలు తీరతాయి.

◆ మునగాల మండలం తాడ్వాయి క్రాస్‌రోడ్డు నుంచి పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ మనుషులతో పాటు పశువులు మృతి చెందుతున్నాయి. రాత్రి ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నా.. బారికేడ్లు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం లేదు.


చౌటుప్పల్: దండుమల్కాపురం శివారులో ప్రమాదకర కూడలి

వ్యతిరేక దిశలో రాకపోకలు

–గోపాల్‌రావు, తెలంగాణ పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పారిశ్రామిక పార్కుకు ఇప్పుడు రోజూ వెయ్యి వరకు వాహనాలు వస్తున్నాయి. 1800 ఎకరాల్లో విస్తరించి ఉన్న పార్కులో పరిశ్రమలన్నీ ప్రారంభమైతే పది వేలకు వరకు వస్తాయి. పార్కు నుంచి విజయవాడ మార్గంలోకి వ్యతిరేక దిశలో వెళ్లాల్సి వస్తోంది. సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరించాలని వారు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు.

రహదారి విస్తరణ సమయంలో నిర్మిస్తాం

– నాగేశ్వర్‌రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్‌హెచ్–65

గత ప్రతిపాదనల ప్రకారం ప్రస్తుతం కొన్ని బ్లాక్ స్పాట్‌లలో అండర్‌పాస్ వంతెనలు నిర్మిస్తున్నాం. కొత్తగా అవసరమయ్యే ప్రాంతాల్లో ఆరు వరసల రహదారి విస్తరణ సమయంలో చేపడతాం. విస్తరణ అంశం డీపీఆర్ దశలో ఉంది. వచ్చే ఏడాది పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

శాంతి స్థాపనలో పోలీసుల పాత్ర మరువలేనిది: మంత్రి

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: సమాజాన్ని శాంతియుతంగా ఉంచడంలో పోలీసుల పాత్ర మరువలేనిదని రోడ్లు భవనాలశాఖ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. స్వార్థం లేకుండా సమాజం కోసం ప్రాణాలర్పించడానికైనా వెనుకాడని సేవకుడు పోలీస్ అని కొనియాడారు. సోమవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై పోలీస్ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. పోలీసులు తమ జీవితాలను ప్రాణంగా పెట్టి ప్రజలకు రక్షణ కల్పిస్తారని, రాణా అంటే బాధలను తీర్చే కేంద్రమని చెప్పారు. నల్గొండ జిల్లాలో అమరులైన సుమారు 15 పోలీస్ కుటుంబాలకు సాయం చేసేందుకు సీఎంతో చర్చిస్తామన్నారు. ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా ప్రతి కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. అనంతరం 15 మంది కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున చెక్కులను అందజేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, ఎమ్మెల్యే బీఎల్ఆర్, మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ రాములునాయక్, పుర వైస్‌ఛైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి


అమరవీరుల స్తూపం వద్ద అభివందనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్

బ్రోచర్ ఆవిష్కరణ

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 20, 21వ తేదీల్లో నిర్వహించే జాతీయ సెమినార్ ప్రచార బ్రోచర్‌ను సోమవారం కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, అధ్యాపకులు ఆవిష్కరించారు. స్థిరమైన అభివృద్ధి- అవకాశాలు సవాళ్లు అనే అంశంపై సెమినార్ కొనసాగుతుందని తెలిపారు.

వైటీపీఎస్‌లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం (వైటీపీఎస్) నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగవకాశం కల్పించనున్నట్లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 169 మంది తమ ఇళ్లు కోల్పోగా.. వారిని ప్రభుత్వం పునరావాస కేంద్రాలకు తరలించిందన్నారు. వారికి లబ్ధిచేకూరేలా రూ.5లక్షల పరిహారం కానీ, ఇంటికో ఉద్యోగం కానీ ఇస్తామని ప్రకటించగా.. 133 మంది ఉద్యోగం కావాలని కోరినట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి ఉద్యోగార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామని.. ఇంట్లో ఎవరి పేరుతోనైనా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వారి విద్యార్హతలను బట్టి ఏ ఉద్యోగం ఇవ్వాలో సంస్థ నిర్ణయిస్తుందని.. తదనుగుణంగా శిక్షణ సైతం ఇస్తుందన్నారు. దరఖాస్తులకు వారం రోజుల గడువు విధించామన్నారు. కార్యక్రమంలో వైటీపీఎస్ ఈఈ జయరాంరెడ్డి, డీఏవో శ్రీనివాస్ శర్మ, మిర్యాలగూడ, దామరచర్ల తహసీల్దార్లు హరిబాబు, జవహర్ పాల్గొన్నారు.

ధరణి అక్రమాలపై విచారణ.. పట్టాలు రద్దు


టీవీగూడెం సమీపంలోని సీలింగ్ భూమి

23.37 ఎకరాల సీలింగ్ భూమి స్వాధీనం

దామరచర్ల, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాం ధరణిలో జరిగిన అక్రమాలపై అధికారులు దృష్టి సారించారు. విలువైన భూములు కాజేసేందుకు ధరణిలో నమోదు చేయించుకుని పట్టాలు పొందిన వారి వివరాలు వెలికితీస్తున్నారు. తాజాగా దామరచర్ల మండలం కొత్తపల్లి గ్రామ రెవెన్యూ పరిధి తాళ్లవీరప్పగూడెం శివారులో 23.37 ఎకరాల సీలింగ్ భూమిపై ఉన్న పట్టాలను రద్దు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.8 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ జవహర్‌లాల్ సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వైటీపీఎస్ ప్లాంటుకు సమీపంలో తాళ్లవీరప్పగూడెం వద్ద సర్వేనెంబరు 66లో 15.08 ఎకరాలు, సర్వేనెంబరు 67లో 8.29 ఎకరాలు మొత్తం 23.37 ఎకరాల భూమి జాబిశెట్టిశేషమ్మ పేరుతో ఉండగా 1997లో సీలింగ్ యాక్టు ప్రకారం పట్టాదారు నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ భూములపై నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు పొందినట్లు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో విచారణ జరిపారు. ధరణిలో పేర్లను నమోదు చేసి సర్వేనెంబరు 67లో 8.29 ఎకరాలు, సర్వేనెంబరు 66లో 12.39 ఎకరాలకు పట్టాలు పొందినట్లు గుర్తించారు. ఈ భూములపై అంబటి రామాంజనేయులు ఆరెకరాలు, వింజం ముసలయ్య 5.29 ఎకరాలు, సాధినేని శ్రీనివాసరావు 2.25 ఎకరాలు, రాయికింది దివ్య, నాలావత్ కమిలి మూడెకరాలు చొప్పున, ఇండియా సిమెంట్స్ ఎకరం పట్టా పొందారు. ఈ పట్టాలను రద్దు చేస్తున్నామని, భూములను స్వాధీనం చేసుకుంటున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు. ఈ రెవెన్యూ గ్రామపరిధిలో వివిధ సర్వేనెంబర్లలో 120 ఎకరాల సీలింగ్ భూమి ఉంది. ధరణి అమలు కాగానే ఈ భూములను పలువురు అక్రమంగా పట్టాలు పొందినట్లు ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై కూడా సమగ్రంగా విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

పథకాల అధ్యయనానికి నల్గొండ జిల్లా వేదిక

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: అభివృద్ధి సంక్షేమ పథకాల అధ్యయనానికి నల్గొండ జిల్లా చక్కని వేదికని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనానికి మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాకు కేటాయించిన 21 మంది ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందం సోమవారం కలెక్టర్‌తో సమావేశమయ్యారు. నల్గొండ జిల్లా 33 మండలాలు, 4 రెవెన్యూ డివిజన్లతో ఏర్పాటైందని, వ్యవసాయం ప్రధాన జీవనాధారం అని వివరించారు. ఐఏఎస్, ఐపీఎస్, పోస్టల్ తదితర అధికారులు ఉన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు సివిల్ సర్వీసెస్ బృందం జిల్లాలోని పీఏపల్లి మండలం రంగారెడ్డిగూడెం, చింతపల్లి మండలం జర్పులతండా, దేవరకొండ మండలం కర్నాటిపల్లి, కొండమల్లేపల్లి మండలం ఇస్లావత్‌తండాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనం చేయనున్నారు. 25న మేజర్ గ్రామపంచాయతీలలో అధ్యయనం చేసిన అనంతరం 26, 27 తేదీలో దేవరకొండ, నాగార్జునసాగర్ పురపాలికల్లో అధ్యయనం చేయనున్నారు. 28న నల్గొండలో కలెక్టర్‌ను మరోసారి కలిసి తమ అనుభవాలను వివరించనున్నారు.


కలెక్టరేట్‌లో సివిల్ సర్వీసెస్ అధికారుల బృందంతో కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్గొండ సంక్షేమం: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ అంశాలపై అధికారులతో సమావేశమయ్యారు. 63 ఫిర్యాదులు రాగా ఎక్కువ శాతం అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. సామాజిక ఆర్థిక సర్వేకు ఎన్యుమరేటర్లను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, ప్రత్యేక కలెక్టర్ నటరాజ్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పుడు స్పౌజ్ ఉపయోగించిన ఉపాధ్యాయుల సస్పెన్షన్

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ బదిలీల్లో తప్పుడు స్పౌజ్‌ను వినియోగించి బదిలీ అయిన ఆరుగురు ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కనగల్, తిప్పర్తి, చిట్యాల, నల్గొండ, మిర్యాలగూడ మండలాలకు చెందిన ఒక ఎస్జీటీ, ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించినట్లు విశ్వసనీయ సమాచారం.

పోలీస్ కుటుంబ సభ్యుల రాస్తారోకో

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రం సమీపంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి 12వ పటాలం పోలీసుల కుటుంబ సభ్యులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. పలువురు బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ విధుల విషయంలో అధికారులు కింది స్థాయి ఉద్యోగులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా అమల్లోకి వచ్చే రికార్డు పద్ధతిని ఉపసంహరించుకోవాలని, పని భారం 8 గంటలకు తగ్గించాలని కోరారు. ఆర్డర్లీ వ్యవస్థను రద్దుతో పాటు, కామన్ మెస్‌ని తీసివేయాలన్నారు. రాస్తారోకో వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. నల్గొండ డీఎస్పీ శివరాంరెడ్డి, రూరల్ ఎస్సై సైదాబాబా అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు.


డీఎస్పీ శివరాంరెడ్డికి సమస్యలు తెలుపుతున్న పటాలం పోలీసుల కుటుంబ సభ్యులు


ఆరుగురిపై వేటు.. ఆందోళనకు దిగిన ఆరుగురు కానిస్టేబుల్ కుటుంబ సభ్యులను ఉన్నతాధికారులు గుర్తించి వారిని విధుల నుంచి తొలగించారు. దీంతో పటాలంలో పనిచేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు అర్ధరాత్రి వరకు కమాండెంట్ కార్యాలయం ముట్టడించారు. వివరణ కోసం కమాండెంట్ సత్య శ్రీనివాసులను 'న్యూస్‌టుడే' ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఎంజీయూలో తిరిగి బయోమెట్రిక్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయానికి న్యాక్ చేత ఏ గ్రేడ్ వచ్చే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్ కోరారు. సోమవారం ఎంజీయూలో వర్సిటీ అధ్యాపకుల సమావేశంలో మాట్లాడారు. అధ్యాపకులు సమయపాలన, బోధన, పరిశోధనలపై దృష్టిపెట్టాలన్నారు. వర్సిటీతో పాటు పరిధిలోని కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం తిరిగి అమలు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతించాలని కోరారు. రిజిస్ట్రార్ ప్రొ.అల్వాల రవి, ఓఎస్డీ ప్రొ.కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాళ్లు అరుణప్రియ, సుధారాణి, వెంకటరమణారెడ్డి, ప్రేమ్‌సాగర్, సరిత, ఆకుల రవి, రమేశ్, రమేశ్, మాధురి, మద్దిలేటి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎంజీయూలో మాట్లాడుతున్న వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్

అనుగృహం.. అందనంత దూరం


వృథాగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు


ధ్వంసం అవుతున్న విద్యుత్ బోర్డులు

నల్గొండ మండలం అన్నారెడ్డిగూడెం గ్రామంలో 75 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లు కావొస్తోంది. వాటికి విద్యుత్‌తో సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అవి వృథాగా దర్శనమిస్తున్నాయి. ఇళ్లు కనిపించనంత ఎత్తులో మొక్కలు పెరిగాయి. దీంతో ఇవి మందుబాబులకు అడ్డాగా మారాయి. ఇతర రాష్ట్రాల నుంచి వ్యవసాయ పనుల కోసం వచ్చిన కూలీలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. – ఈనాడు నల్గొండ


ఇళ్ల మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలు

సీఎంఆర్ లక్ష్యం.. బహుదూరం


భువనగిరి: ఈ నెల 6న మిల్లులో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎఫ్‌సీఐ అధికారుల బృందం(దాచిన చిత్రం)

భువనగిరి, న్యూస్‌టుడే:

కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి చెల్లించడంలో వెనుకబడిపోయారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి సీజన్‌లో కొన్న ధాన్యాన్ని ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లకు కేటాయించారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం ఇచ్చేందుకు ఎఫ్‌సీఐ అక్టోబరు చివరి వరకు గడువు విధించింది. ఆ లోపు లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. త్వరితగతిన సీఎంఆర్ పూర్తిచేసేలా అధికారులు మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు.

వెనకంజలో సూర్యాపేట జిల్లా

గత రెండు సీజన్లలోనూ నల్గొండ జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్‌ను అప్పగించడంలో ముందంజలో ఉన్నారు. వానాకాలంలో నల్గొండ జిల్లాలో 96 శాతం, యాదాద్రి భువనగిరి జిల్లాలో 90, సూర్యాపేట జిల్లాలో తక్కువగా 61 శాతం బియ్యాన్ని తిరిగి ఇచ్చారు. ఈ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం గడువు పొడిగించే అవకాశాలు కనిపించడంలేదని అధికారులు చెబుతున్నారు.

◆ యాసంగి సీజన్‌కు సంబంధించి కొంత మేరకు మూడు జిల్లాలూ వెనుకబడి ఉన్నాయి. నల్గొండ జిల్లాలో 67 శాతం, యాదాద్రి భువనగిరి 40, సూర్యాపేట జిల్లాలో కేవలం 27 శాతం మాత్రమే సీఎంఆర్‌ను ప్రభుత్వానికి ఇచ్చారు. సూర్యాపేట జిల్లా రెండు సీజన్లలోనూ వెనుకంజలో ఉండటంతో మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా అని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీఎంఆర్ వసూళ్లలో అధికారులు ఉదాసీనతపై ఆరోపణలు ఉన్నాయి.

మధ్యలోనే తనిఖీలు నిలిపి..

మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా తెలుసుకునేందుకు భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) అధికారులు అక్టోబరు 6న తనిఖీలు చేపట్టారు. ఒక రోజు పలు మిల్లుల్లో తనిఖీలు చేసి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మధ్యలోనే నిలిపివేశారు.

మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నాం

– జగదీశ్వర్, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా

సీఎంఆర్ తిరిగి ఇవ్వడంలో యాదాద్రి భువనగిరి జిల్లా మిల్లర్లు ముందంజలో ఉన్నారు. అయినా గడువులోగా చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాం. జిల్లాలో డిఫాల్టైన మిల్లులు లేవు. పూర్తి సీఎంఆర్ సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

2023-24 వానాకాలం సీజన్‌లో సేకరించిన ధాన్యం, సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం	సీఎంఆర్ ఇవ్వాల్సింది	ఇచ్చింది	బకాయి
నల్గొండ	3,22,754	2,17,577	2,08,442	9,134
సూర్యాపేట	2,08,114	1,40,154	85,108	55,046
యాదాద్రి	2,65,197	1,78,887	1,58,493	20,394
2023-24 యాసంగి సీజన్‌లో ..				
నల్గొండ	3,26,067	2,21,726	1,49,444	72,282
సూర్యాపేట	2,40,579	1,63,593	44,340	1,19,253
యాదాద్రి	2,70,668	1,84,054	73,387	1,10,667

బంతి సాగు.. ఆదాయం బాగు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: భిన్న సాగులో రాణించి... ఆదాయం గడించాలని అన్నదాతలు ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం వరుస పండగలు ఉండటంతో దీనిని దృష్టిలో ఉంచుకుని అందుకు అత్యధికంగా వినియోగించే పూల సాగును ఎంచుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పూల సాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం చేతికొస్తున్న బంతిపూల దిగుబడితో అధిక ఆదాయం పొందుతున్నారు. ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు అక్కడక్కడ బంతి పూల తోటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతానికి తోటల వద్ద కిలో రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కొందరు రైతులు దళారులకు కాకుండా నేరుగా వినియోగదారులకే విక్రయిస్తూ మరింత ఆదాయం పొందుతున్నారు. మూస ధోరణిలో సాగు చేపట్టకుండా ప్రజల అవసరాల మేరకు విభిన్నంగా ఆలోచన చేసి ఆదాయం పొందుతూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



సంస్థాన్ నారాయణపురంలో బంతి పూల సాగులో యువకుడు శికిలమెట్ల శివప్రసాద్

రైతేరాజు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024-25 సంవత్సరంలో 7,562 ఎకరాల్లో సాగు చేపట్టారు. కాగా గత ఏడాది 5,752 ఎకరాలు చేయగా ఈసారి 1800 ఎకరాల్లో సాగు పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పూలసాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాగులో చీడపీడల నుంచి నష్టం వాటిల్లకుండా, జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు సాగుతున్నారు. వర్షాల కారణంగా అక్కడక్కడ దెబ్బతిన్నా బాగున్న వరకు ఆదాయం బాగానే ఉందని రైతులు పేర్కొంటున్నారు.

సంస్థాన్ నారాయణపురం: బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకొని బంతి పూల సాగు చేశారు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన శికిలమెట్ల శివప్రసాద్. భిక్షమయ్య-యాదమ్మలకు ఎకరంన్నర వ్యవసాయ భూమి ఉంది. పండుగలను దృష్టిలో పెట్టుకొని అర ఎకరంలో బంతిపూల సాగు చేశారు. స్థానిక కంపెనీలో పనికి వెళ్తూ పూల సాగుపై ఆసక్తి చూపి.. పండుగ వేళ దిగుబడి వచ్చేలా పచ్చ, ఎర్ర బంతి సాగు చేశారు. ప్రస్తుతం పూలను తెంపి ఇంటి వద్ద కుప్పలుగా పోసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. కొనుగోలుదారులు ఇంటి వద్దకే రావడంతో ఖర్చులు తగ్గి అన్నుకున్న లాభాన్ని ఆశిస్తున్నారు.



యాసంగిలో వేరుసెనగకు అనుకూల సమయం, రకాలు

త్రిపురారం, న్యూస్‌టుడే: యాసంగిలో వేరు సెనగ సాగు చేయడానికి అనుకూల సమయం, రకాల గురించి కంపసాగర్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్‌రావు తెలియజేశారు. వేరుసెనగ తెలంగాణలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న నూనె గింజల పంట. దక్షిణ తెలంగాణలో సెప్టెంబరు మొదటి పక్షం నుంచి నవంబరు రెండో పక్షం వరకు విత్తుకోవచ్చు.

రకం	పంట కాలం	దిగుబడి ఎకరాకు
కదిరి - 6	100, 110 రోజులు	12, 14 క్వింటాళ్లు
కదిరి - 9	110, 120 రోజులు	10 ,12 క్వింటాళ్లు
ధరణి :	100, 105 రోజులు	9, 10 క్వింటాళ్లు
కదిరి 7,8	120, 130 రోజులు	12, 14 క్వింటాళ్లు

యాసంగిలో నీటి పారుదల కింద సాగు చేసేటప్పుడు *22.5, 10 సెం.మీ. దూరంలో ఒక చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండేలా మొక్కల సాంద్రత పాటించాలి.*

సమస్య - సమాధానం

? బత్తాయిలో వేరుకుళ్లు తెగులు నివారణ గురించి తెలపండి.

– రామకృష్ణ, హరిజనాపురం గ్రా., చింతపల్లి మండలం

సమాధానం: నివారణకు రంగాపూర్ నిమ్మ మీద అంటుకట్టిన మొక్కలను నాటటం శ్రేయస్కరం. వ్యాధి సోకిన తొలి దశలోనే గమనించి చెట్టుకు నీరు కట్టి మరుసటి రోజు కార్బండిజమ్ 2 గ్రా., మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి, (చెపుల్) మందును 3 గ్రా., లీటరు నీటికి, 1 శాతం బోర్డో మిశ్రమాన్ని చెట్ల పాదుల్లో నేల తడిసేలా పోయాలి.

? వరిలో సుడిదోమ నివారణ గురించి తెలపండి.

సుధీర్‌రెడ్డి, సింగారం గ్రా., మునుగోడు మండలం

సమాధానం: పిలకదశలో దుబ్బుకు 10, 15 అంకురం నుంచి ఈనిక దశలో దుబ్బుకు 20, 25 దోమలు గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి. తొలి దశలో ఎసిఫేట్ 75 ఎస్‌.పి 1.5 గ్రా., ఇథోఫెన్‌ప్రాక్స్ 10 ఇ.సి 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు డైనోటిప్యూరాన్ 20 యస్‌.జీ 0.4 గ్రా., పైమెట్రోజైన్ 50 డబ్ల్యూ.జీ., 0.60 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

? మిరపలో కాయతొలుచు పురుగు నివారణ గురించి తెలపండి.

– కొండల్, తుంగపాడు గ్రా., చింతపల్లి మండలం

సమాధానం: ఎకరానికి థయోడికార్బ్ 200 గ్రా., ఎస్‌ఫేట్ 300 గ్రా., క్లోరిఫాస్ 500 మి.లీ, స్పైనోసాడ్ 75 మి.లీ. పిచికారీ చేయాలి. సమగ్ర సస్యరక్షణ అవలంబించాలి.

– త్రిపురారం, న్యూస్‌టుడే

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానం ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771




శ్రీనివాసరావు

మానిపండు తెగులు ఆశించకుండా ఉండాలంటే..

త్రిపురారం, న్యూస్‌టుడే: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో మాని పండు తెగులు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు తెలిపారు. పంట పూత దశలో గాలిలో అధిక తేమ శాతం, మబ్బులతో కూడిన వర్షపు జల్లులు, మంచు కురవడం వంటివి మానిపండు ఉధృతికి దోహద పడుతుంది. పూత దశలో వరి నప్పుడు అండాశయంలో శిలీంద్రం పెరుగుదల వల్ల ఆకుపచ్చ రంగు ముద్దగా అభివృద్ధి చెంది, పసుపు రంగులోకి మారి చివరకు నల్లబడుతుంది. నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. కార్బండిజమ్ 50 శాతం డబ్ల్యూపీ 1 గ్రా., టిబుకొనజోల్, ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 75 డబ్ల్యూజీ 0.4 గ్రా., వెన్నులు పైకి వచ్చే దశలో ఒకసారి, వారం తర్వాత రెండోసారి పిచికారీ చేయాలి.

జీవితం చదివేద్దాం.. బతికి సాధిద్దాం



కోదాడ, మేళ్లచెరువు, మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:


మన తాతలు, తండ్రులు అక్షరం ముక్క చదవకపోయినా.. జీవించారు. రెక్కల కష్టంతోనే ఐదుగురు నుంచి పది మంది పిల్లలను పెంచి పోషించారు. ఇప్పుడున్న వసతులు, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అప్పుడు లేవు. ఇప్పుడున్న యువత చదువు అర్థం కాకపోయినా.. ఫెయిలైనా ఒత్తిడికి లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంతో తల్లిదండ్రుల ఆశలను మధ్యలోనే తుంచి కన్నీళ్లు మిగులుస్తున్నారు. బలవన్మరణానికి పాల్పడే ముందు ప్రతి విద్యార్థి మన ముందు తరాలు విద్య లేకుండానే బతికారు.. మనం బతకలేమా అని ఒకసారి ఆలోచిస్తే.. ఈ ఆత్మహత్యలు ఉండవు.

కోదాడ పరిధిలోని ఓ ఇంటర్ కళాశాలలో పాలకవీడు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదివి ఇంటర్‌లో ఆంగ్ల మాధ్యమం చదువు అర్థం కావట్లేదని ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆంగ్లం కష్టమైతే తెలుగులో చదువుకునే అవకాశం ఉన్నా.. ఆ దారిని ఎంచుకోకుండా క్షణికావేశంలో తనువు చాలించాడు. తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చాడు.

దామరచర్ల మండలంలోని ఓ తండాకు చెందిన తొమ్మిదో తరగతి చదివే బాలిక దసరా సెలవులు ముగించుకొని పాఠశాలకు వెళ్లింది. చదువు ఇష్టం లేదని శుక్రవారం పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మరణించింది. చదువు ఒక్కటే జీవితం కాదు అని ఆలోచించే శక్తి లేక, మరో దారి తెలుసుకోక బాలిక ప్రాణాలు తీసుకుంది.

మేళ్లచెరువు మండలానికి చెందిన ఓ విద్యార్థి గతేడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యాడు. ఈ విషయం జీర్ణించుకోలేని ఆ బాలుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు కూలి పనులకెళ్లి చదివిస్తే చివరికి శోక సంద్రంలో ముంచాడు.

భరోసా కల్పించాలి



గ్రామీణ విద్యార్థులు ఎక్కువ శాతం తెలుగు మాధ్యమంలో చదువుతుంటారు. ఇంటర్‌లోకి వచ్చే సరికి ఆంగ్ల మాధ్యమం ఎంచుకుంటున్నారు. భవిష్యత్తులో తెలుగులో కంటే ఆంగ్ల మాధ్యమం చదివిన వారికే అవకాశాలు ఉంటాయనే అపోహతో ఇంగ్లిష్ విద్యనభ్యసిస్తున్నారు. ఒకేసారి భాషాపరమైన ఒత్తిడి.. పోటీని తట్టుకొని నిలబడాలనే ఉద్దేశంతో శక్తికి మించి కష్టపడుతూ కుంగుబాటుకు లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు.

★ మొదటి సారి ఇంగ్లిష్ మీడియంలోకి వచ్చిన పిల్లలను దృష్టిలో ఉంచుకొని వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కళాశాలల యాజమాన్యాలపై ఉంది.

★ ఫీజుల వసూళ్లపైనే దృష్టి ఉంచకుండా.. చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించాలి. ★ మానసిక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించి ఆత్మస్థైర్యం పెంపొందించాలి.

★ విద్యాశాఖ అధికారులూ క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని భరోసా కల్పించాలి.

వీరే మనకు ఆదర్శం

☛ కోదాడకు చెందిన గూటి వీరబాబు పదో తరగతి ఫెయిల్ కావడంతో ఏడాది పాటు పశువులు, మేకలు మేపారు. ఇంటర్ అతి కష్టం మీద పాసయ్యారు. తర్వాత ఉన్నత చదువులు చదివారు. తాజాగా వచ్చిన డీఎస్సీ ఫలితాల్లో 47 ఏళ్ల వయసులో సోషల్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు.

☛ ఆరో తరగతిలోనే చదువు మానేసి ఆరేళ్ల పాటు వివిధ పనులు చేస్తుంటూ.. తిరిగి దూర విద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరారు.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన కుక్కల సైదులుగౌడ్. పదో తరగతిలో ఐదు సార్లు, డిగ్రీలో ఎనిమిది సార్లు ఫెయిలైనా కుంగి పోకుండా.. కష్టపడి చదివి గ్రూప్-2లో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం పొందారు.

☛ ఏళ్ల తరబడి ఉద్యోగం రాక కుంగిపోయిన మిర్యాలగూడకు చెందిన కట్టా సోమిరెడ్డి కుటుంబ పోషణకు ఆటో డ్రైవర్‌గానూ మారారు. 16 ఏళ్ల తర్వాత గురుకుల ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు.

☛ నాలుగేళ్లలో 35 ఉద్యోగ అర్హత పరీక్షల్లో ఫెయిలైనా కుంగిపోకుండా 2018లో ప్రయత్నించి సివిల్స్‌లో 104వ ర్యాంకుతో ఏకంగా ఐఏఎస్ సాధించారు.. హరియాణాకు చెందిన విజయ్‌వర్ధన్.

చదువుతోనే జీవితం అవాస్తవం

– వీరేందర్, మానసిక నిపుణుడు, హైదరాబాద్



చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే. చదువు రాకపోతే బతకలేమనేది అవాస్తవం. ఆత్మహత్య చేసుకునే ముందు విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. అమ్మానాన్న, అధ్యాపకులు కూడా పిల్లలు ఏ రంగంలో రాణిస్తారో గుర్తించి, అందులో వారిని ప్రోత్సహించాలి. విద్యార్థుల ప్రవర్తన, కదలికలను అనుక్షణం గమనించాలి. ఇప్పుడున్న యువత క్షణికావేశానికి లోనవుతున్నారు. వారిని ముందే గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే ఫలితం ఉంటుంది.

20 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



నాగార్జునసాగర్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: శ్రీశైలం నుంచి 2,02,730 క్యూసెక్కుల భారీ వరదనీరు వస్తుండటంతో ఎన్నెస్పీ అధికారులు సాగర్ నుంచి 20 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. సోమవారం రాత్రి 9 గంటలకు అందిన సమాచారం మేరకు. . అధికారులు 20 గేట్లు 5 అడుగుల మేరకు ఎత్తి 1,59,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గేట్లతోపాటు కుడి, ఎడమ, వరద కాల్వలు, ప్రధాన విద్యుత్కేంద్రం, ఎస్సెల్బీసీల ద్వారా మొత్తం 2,02,730 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. జలాశయ ప్రస్తుత నీటి మట్టం 588.90 అడుగుల వద్ద ఉంది.

టెయిల్‌పాండ్‌లో.. అడవిదేవులపల్లి: ఎగువ ప్రాంతం నుంచి టెయిల్‌పాండ్‌కు వరద నీటి రాక కొనసాగుతుండగా టెయిల్‌పాండ్ అధికారులు 14 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం.. ఎగువనున్న నాగార్జునసాగర్ జలాశయం నుంచి భారీగా వరద వస్తుండగా టెయిల్‌పాండ్ అధికారులు 13 గేట్లను 3 మీటర్లు, 1 గేటును 2.5 మీటర్లమేర ఎత్తి 2,13,088 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతలకు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయ నీటి మట్టం 75.09 మీటర్ల వద్ద ఉందని ప్రాజెక్ట్ ఏఈ జయపాల్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాపై దృష్టి పెట్టాలి: కలెక్టర్



ఓటరు నమోదుపై దూరదృశ్య శ్రవణ సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా అధికారులు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, సాధారణ ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై దృష్టి సారించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆర్డీవోలను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఆర్డీవోలతో సోమవారం దూరదృశ్య శ్రవణ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేలా దరఖాస్తు చేయించాలన్నారు. జిల్లాలో 3500 నుంచి 4 వేల మంది టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకావల్సి ఉందని చెప్పారు. ఈనెల 26లోపు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజుల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు.

28 లోపు ఫీజు చెల్లించాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం డిగ్రీ 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈనెల 28లోపు చెల్లించాలని ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఉద్యోగ విరమణలు



గరిడేపల్లి మండలం అప్పన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రం

❍ 65 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయినులు, ఆయాలకు అవకాశం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ఉన్నతీకరిస్తూ.. అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంది. కొంత విద్యార్హత కలిగిన స్థానిక మహిళలను అంగన్‌వాడీలో ఉపాధ్యాయినులు, ఆయాలుగా నియమించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఉన్న వారిలో 65 ఏళ్లు పైబడిన వారిని ఉద్యోగ విరమణ చేయించాలని నిర్ణయించింది.

ఆసరా పింఛనుకు వెసులుబాటు

ఉమ్మడి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు 88 మంది, ఆయాలు 334 మంది ఇప్పటికే ఉద్యోగ విరమణ చేశారు. వీరిలో ఉపాధ్యాయినులకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నల్గొండ జిల్లాలో 43 మంది ఉపాధ్యాయినులు ఇప్పటికే ఉద్యోగ విరమణ ప్రతిఫలం అందుకోగా.. మిగిలిన వారికి త్వరలోనే అందనున్నాయి. వీరు ఆసరా పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

నిబంధనల ప్రకారమే వయసు నిర్ధారణ

నరసింహారావు, జిల్లా సంక్షేమాధికారి, సూర్యాపేట



అంగన్‌వాడీ కేంద్రాల్లో వయసు నిర్ధారణ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగింది. విద్యాశాఖ నుంచి జారీ చేసిన బోనఫైడ్, టీసీ, మార్కుల మెమో, ప్రొవిజనల్ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా వయసు నిర్ధారణ చేస్తున్నాం. ఇప్పటికే 65 ఏళ్లు పైబడిన వారు ఉద్యోగ విరమణ చేశారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రకటించిన నగదు రావాల్సి ఉంది.

ఆధారం.. పదో తరగతి మెమో

ఉద్యోగ విరమణ వయసును నిర్ధారించేందుకు పదో తరగతి లేదా ఆపై చదువుల్లో విద్యాశాఖ అందించిన ధ్రువీకరణ పత్రాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 90 శాతం పైగా సిబ్బందిలో ఎటువంటి విద్యా ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో.. వారిని జిల్లాలో ఆసుపత్రుల్లో బోన్ డెన్సిటోమెట్రీ నివేదిక ప్రకారం సుమారుగా నిర్ధారించే వయసు ధ్రువీకరణ ఆధారంగా కలెక్టర్ అనుమతుల మేరకు ఉద్యోగ విరమణ చేయించారు. వీరిలోనూ సిబ్బందికి వేతనాలు చెల్లించే ఈఎంఎస్ పోర్టల్‌లో 65 ఏళ్లు పైబడి వయసు చూపించే వారినే వైద్య పరీక్షలకు పంపించారు. పలు ప్రాజెక్టుల్లో ఆయాలను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వృద్ధులుగా కనపడే వారు, హుషారుగా పని చేయలేని వారిపై ఒత్తిడి తెస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన వారు

జిల్లా	ఉపాధ్యాయినులు	ఆయాలు
నల్గొండ	58	168
సూర్యాపేట	10	57
యాదాద్రి	20	109

శ్రీనివాస్.. సేవల్లో శభాష్



అలువాల శ్రీనివాస్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై అంబులెన్సులో 'ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్'గా విధులు నిర్వహిస్తున్న చౌటుప్పల్‌కు చెందిన అలువాల శ్రీనివాస్ రక్తదాతగా, ఉచిత వైద్య శిబిరాల నిర్వాహకుడిగా, సామాజిక సేవకుడిగా కొన్నేళ్లుగా ప్రశంసలందుకుంటున్నారు. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాలకు చెందిన అలువాల శ్రీనివాస్ కుటుంబం 2001లో చౌటుప్పల్‌కు వలసొచ్చింది. కోదాడలోని కేఆర్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసి సార్వత్రిక విద్యలో డిగ్రీ చదివారు. అమీర్‌పేటలోని మెడికల్ టెక్నాలజీ కళాశాలలో డీఎంఎల్టీ కోర్సు చదివాక అరబిందో ఫార్మాలో ఎనిమిదేళ్లు ఉద్యోగం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆకర్షితుడై ఉద్యోగాన్ని వదిలి ఉద్యమకారుడిగా మారారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక మూడేళ్లపాటు ఆర్ఎంపీగా, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నేతగా సేవలందించారు. తర్వాత నార్కట్‌పల్లిలోని కామినేనిలో ఎమర్జెన్సీ డ్రగ్ డిపార్ట్‌మెంట్‌లో టెక్నీషియన్‌గా మళ్లీ ఉద్యోగంలో చేరి మూడేళ్లు పనిచేశారు. 2020లో జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహించే 1033 అంబులెన్సులో ఈఎంటీగా నాలుగేళ్లుగా సేవలందిస్తున్నారు.

ప్రత్యేకతలు ఇలా..

- ❍ అత్యవసర సమయంలో ఆపన్నుల కోసం 18 సార్లు రక్తదానం చేశారు.
- ❍ సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో 15 ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు.
- ❍ నాలుగేళ్లలో 1033 అంబులెన్సు ఈఎంటీగా సుమారు 2500 మంది రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు.
- ❍ మానసిక స్థితి సరిగా లేక జాతీయ రహదారి వెంట తిరిగే ఇరవై మందిని చౌటుప్పల్‌లోని అనాథాశ్రమంలో చేర్పించారు.
- ❍ జీఎంఆర్-వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రోడ్డు భద్రత, అవగాహన శిబిరాల్లో పాల్గొని ప్రశంసలందుకున్నారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: రైలు కింద పడి యువకుడు బలవన్మరణం చేసుకున్న ఘటన భువనగిరి మండల పరిధిలోని జమ్మాపురం పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన మొలుగు సాయి(25) హైదరాబాద్‌లోని జీడిమెట్ల కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. రాయగిరి-వంగపల్లి రైలు మార్గంలో మైలురాయి 248/7-5 వద్ద సోమవారం సాయంత్రం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి గతంలో చనిపోయాడు. తల్లి, సోదరుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడి రిమాండ్

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: బాలసదన్‌లో 13 ఏళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ అటెండర్ ఇ.వెంకటరెడ్డి(31)పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 6:30 గంటలకు భువనగిరి బాల సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆ సమయంలో వాష్‌రూంకు వెళ్లి వస్తున్న ఓ బాలికపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ అటెండర్ వెంకటరెడ్డి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె విలపించింది. విషయాన్ని బాలల పరిరక్షణ అధికారులకు బాధితురాలు తెలియజేయడంతో విచారణ చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో చట్టంలోని సెక్షన్ 7, 8 కింద కేసు నమోదు చేసి అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేటు న్యాయస్థానంలో సోమవారం హాజరుపర్చారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



గుగులోత్ వెంకన్న

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గిరిజన రైతు మృతిచెందిన ఘటన మండలంలోని గట్టికల్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పీపానాయక్‌తండాకు చెందిన గుగులోత్ వెంకన్న(46) గేదెలను తోలుకొని గట్టికల్‌కు చెందిన కోన రాంబాబు కోసిన వరిపొలం మీదుగా వెళ్తున్నాడు. రాంబాబు వ్యవసాయ క్షేత్రంలో పూర్తిగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు వెంకన్నకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కొయ్యకాళ్లపై పడి మృతిచెందారు. ఆయన వెంట వస్తున్న ఓ కుక్క కూడా షాక్‌కు గురై చనిపోయింది. గేదెలు ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. మృతుడికి భార్య నీలా, ఒక కుమారుడు, కుమార్తె(వివాహమైంది) ఉన్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



ఖమ్మంపాటి మునీశ్వర్

నాగారం, న్యూస్‌టుడే: ఈతకు వెళ్లి ఓ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని వర్ధమానుకోటలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఖమ్మంపాటి నాగరాజు-ఉపేంద్ర దంపతుల పెద్ద కుమారుడు ఖమ్మంపాటి మునీశ్వర్(11) స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం బిక్కేరు వాగులో ఈతకు వెళ్లి నీటి ఉధృతిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. మిత్రులు భయభ్రాంతులకు లోనై ఎవరింటికి వారు వెళ్లారు. చీకటి పడినా బాలుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అనుమానంతో అతని స్నేహితులను ఆరా తీసినా ఏమీ చెప్పలేదు. పోలీసులు మందలించడంతో వాగులో మునిగిపోయినట్లు చెప్పారు. సోమవారం బాలుడి తల్లిదండ్రులు, బంధువులు గాలించగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఐలయ్య తెలిపారు.

అమ్మమ్మ ఇంట్లో అంత్యక్రియలు రెండేళ్ల క్రితం బాలుడి తాత ఖమ్మంపాటి యాదగిరికి రెండు కిడ్నీలు పాడవగా ఉన్న ఇంటిని అమ్మి వైద్యం చేయించారు. ప్రస్తుతం ఆ కుటుంబం అద్దె ఇంట్లో ఉంటోంది. నాగారం(బంగ్లా)లో బాలుడి అమ్మమ్మ ఇంటికి మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

వేగంగా ధాన్యం కొనుగోళ్లు: ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. నకిరేకల్ మండలం ఓగోడు, టేకులగూడెం, వల్లభాపురం, నెల్లిబండ, గోరెంకలపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బొళ్ల వెంకటరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, తహసీల్దారు జమీరోద్దీన్, ఎంపీడీవో చంద్రశేఖర్, సైదులు, నరేశ్, కొండయ్య, నరేందర్, ఎల్లేశ్ పాల్గొన్నారు.



నకిరేకల్: ఓగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, డీసీఎంఎస్ ఛైర్మన్ వెంకటరెడ్డి

కేతేపల్లి: మండలంలోని ఇప్పలగూడెం, గుడివాడ, కాసనగోడు, బొప్పారం గ్రామాలలో డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బొళ్ల వెంకటరెడ్డి, తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం... నకిరేకల్: తాటికల్ పంచాయతీ పరిధిలోని బైరెడ్డిగూడకు బీటీ రోడ్డు, మండలాపురం-కొండకిందిగూడెం బీటీ రోడ్డు నిధుల మంజూరుకు ఎమ్మెల్యే వీరేశం కృషిచేశారని ప్రధాన కూడలిలో, బైరెడ్డిగూడలో ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. కొండయ్య, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, సుధాకర్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి గ్రామీణం: మండలంలోని చిప్పలపల్లి, బెండలప హాడ్, బాజకుంట గ్రామాలల్లో పీఏసీఎస్, ఐకేపీ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వీరేశం సోమవారం ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఉశయ్య గౌడ్, సాగర్‌రెడ్డి, సత్తయ్య, సత్తయ్య, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాల పురపరిధి శివనేనిగూడెంలో మహాలింగం చెరువును ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం పరిశీలించారు. చెరువువద్ద కొబ్బరికాయ కొట్టిన ఎమ్మెల్యే చెరువులోకి పూలను వదిలారు. పురఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాటం వెంకటేశం, నర్రా మోహన్‌రెడ్డి, నూతి సైదులు , తదితరులున్నారు.

ఆవిష్కరణ

నల్గొండ గ్రామీణం: రైతుల సంక్షేమం కోసం కోణం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్గొండలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో కోణం ఫౌండేషన్ సహకారంతో కట్టంగూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ నిర్వహిస్తున్న కస్టమ్ హైరింగ్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
80085 52710, 80085 66199
8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని 43వ వార్డు పరిధిలోని డాక్టర్ కాలనీలో బస్టాండ్ నుంచి వచ్చే మురుగు కాల్వ పూడిపోయింది. మురుగు పొంగిపొర్లుతోంది. పలుమార్లు పుర సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు.

– కుంభం కృష్ణారెడ్డి, నల్గొండ.

✔ పరిశీలించి వెంటనే కాల్వలు శుభ్రం చేయిస్తాం.

– శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.

కలల వేతనం.. కన్నవారికే

చిట్యాల, న్యూస్‌టుడే



ఎ.భవాని

చదువుకోవాలనే పట్టుదల వారిలో ఉంది. దానికి వారి అమ్మానాన్నలు ప్రోత్సాహాన్ని అందించారు. వారి ఆశలను నిజం చేస్తూ తాజా డీఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించి తమ పట్టుదలను నిరూపించుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా తమ తొలివేతనాన్ని అమ్మానాన్నకు ఇచ్చి వారి కళ్లల్లో ఆనందాన్ని చూడాలని వారు భావిస్తున్నారు. ఈ మేరకు చిట్యాల పురపాలికతో పాటు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా విధుల్లో చేరినవారు తమ మనోభావాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

అమ్మకు బహుమతి: ఎ.భవాని, ఎస్‌జీటీ ప్రాథమిక పాఠశాల, పెద్దకాపర్తి

నా తొలివేతనాన్ని అమ్మ పార్వతమ్మకు బహుమతిగా ఇవ్వాలని సంకల్పించుకున్నాను. ఆమె ప్రోత్సాహంతోనే బీఏ, బీఈడీ, డీఈడీ పూర్తి చేయగలిగాను. ఇంటర్‌తోనే అమ్మ చదువు ఆగిపోయింది. పట్టుబట్టి నన్ను, చెల్లిని, తమ్ముడిని మా అమ్మ కష్టపడి చదివించారు. 2017లో డీఎస్సీ రాసినా, ఒక్కమార్కుతో అవకాశం కోల్పోయాను. నాలో ధైర్యం నింపి మళ్లీ డీఎస్సీకి సన్నద్ధం అయ్యేవిధంగా అమ్మతోపాటు నా భర్త వీరన్న ప్రోత్సహించారు.

ఆనంద బాష్పాలను చూశాను:



మంద సౌమ్య, స్కూల్ అసిస్టెంట్ (ప్రత్యేక విద్య), చిట్యాల

తొలి వేతనం పూర్తిగా అమ్మానాన్న కరుణశ్రీ, భాస్కర్‌కు ఇస్తాను. వారి ప్రోత్సాహం వల్లనే నేను ఇంతదూరం రాగలిగాను. మేము ఇద్దరం అక్కాచెల్లెళ్లం, ఇద్దరిలో ఒక్కరికన్నా ప్రభుత్వ ఉద్యోగం లభించాలని వారు కోరుకున్నారు. డీఎస్సీ ఫలితాలు వచ్చినరోజున వారికళ్లల్లో ఆనందబాష్పాలను చూశాను. వారి ప్రోత్సాహం, ఆశీస్సుల వల్లే నాకు ఉద్యోగం లభించిందని భావిస్తున్నాను.'

నూతన వస్త్రాలు కొనిపెడతా:



కె. లీలావతి, స్కూల్ అసిస్టెంట్, జడ్పీ ఉన్నత పాఠశాల, ఏపూరు

నా తొలివేతనంతో అమ్మా, నాన్నలకు కొత్త దుస్తులు కొనిపెట్టాలని నిర్ణయించుకున్నాను. మా ఇంట్లో నలుగురం అమ్మాయిలం. అమ్మానాన్నలు మా చదువుల కోసం ఎంతో కష్టపడ్డారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉండగానే నా వివాహం చేశారు. డిగ్రీతో పాటు ఎంఏ, బీఈడీ నా భర్త నర్సిరెడ్డి పూర్తి చేయించారు. నలుగురు అమ్మాయిల్లో ఒక్కరన్నా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది అమ్మానాన్న కల. అది నెరవేరింది.

అమ్మానాన్నకు ఇస్తాను:



గోపగోని ఉజ్వల, ఎస్‌జీటీ, యూపీఎస్ ఆరెగూడెం.

తొలివేతనాన్ని పూర్తిగా మా అమ్మానాన్న చిలుకమ్మ, నరసింహకు ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. వారు నా చదువు(ఎంఎస్సీ,డీఈడీ) కోసం ఎంతో కష్టపడ్డారు. కూతురుగా తొలి సంపాదనను వారికి ఇస్తే కూతురు ప్రయోజకురాలై తమకు తొలివేతనం ఇచ్చిందని వారు తృప్తిచెందుతారని భావిస్తున్నాను. మలివేతనాన్ని మా పాఠశాలలో విద్యార్థులకు లేదా అనాథ పిల్లల కోసం కొంత వెచ్చించాలని అనుకుంటున్నాను.

ఎంఈఎఫ్ నేత మృతి

నకిరేకల్, న్యూస్‌టుడే: మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు కందికంటి అంజయ్యమాదిగ (49) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. మంగళపల్లి గ్రామానికి చెందిన అంజయ్య నకిరేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ సహాయకునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, టీపీసీసీ పూర్వ కార్యదర్శి దైద రవీందర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల సుకన్య, ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప తదితరులు వేర్వేరుగా పూలమాలలతో నివాళి అర్పించారు. మాజీ సర్పంచి నవీన్‌రావు, మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నకిరేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అంజయ్య సంతాప కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు నివాళి అర్పించారు.



నకిరేకల్: మంగళపల్లిలో అంజయ్యమాదిగ పాడె మోస్తున్న మంద కృష్ణమాదిగ

23న ఉద్యోగ మేళా

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 23న నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల డీవీకే రోడ్, నల్గొండ నందు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎన్.పద్మ తెలిపారు. ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు చరవాణి 78934 20435లో సంప్రదించాలని కోరారు.

రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో... నల్గొండ విద్యావిభాగం: నల్గొండలోని డా.రెడ్డీస్ ఫౌండేషన్ గ్రో ప్రోగ్రాం ఆధ్వర్యంలో వివిధ కోర్సులపై రెండు నెలల శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ నల్గొండ నిర్వాహకురాలు అల్మాస్ఫర్వీన్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్‌స్కిల్స్, టైపింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 26లోపు నల్గొండలోని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 70326 49925లో సంప్రదించాలని కోరారు.




పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నల్గొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యా సమస్యలపై నిరంతర పోరాటాలు

నీలగిరి, న్యూస్‌టుడే: విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించేందుకు పీడీఎస్‌యూ ముందుండి నిరంతరం పోరాటాలు సాగిస్తుందని సీపీఐ(ఎంఎల్) నాయకుడు డేవిడ్‌కుమార్ అన్నారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నల్గొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సభలో డేవిడ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు గ్రామాల్లో ప్రజలతో కలిసి ఉద్యమాలు చేయడం పీడీఎస్‌యూతోనే మొదలైందన్నారు. ఇందూరు సాగర్ అధ్యక్షతన జరిగిన సభలో సంఘం పూర్వ నాయకులు పర్వతాలు, జానకిరామ్‌రెడ్డి, గురువయ్య, వెంకటేశ్వర్లు, సత్యానారాయణ, కిరణ్, సింహాద్రి, భరత్ చందర్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ వెల్లంలను పది రోజుల్లో నింపుతాం: మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును పది రోజుల్లో నింపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కాలువల ద్వారా చెరువులు నింపేందుకు కావాల్సిన నిధులను మంజూరు చేయించినట్లు వెల్లడించారు. సోమవారం నల్గొండ మండలం ఖాజీరామారంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎల్లమ్మ దేవాలయానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. నల్గొండ నియోజకవర్గానికి 4 వేల ఇళ్లు మంజూరు అయ్యాయని.. ఇందులో గ్రామానికి 50 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్డీవో శ్రీదేవి, డీపీవో మురళి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, జూకూరి రమేష్ లక్ష్మయ్య, షబ్బీర్‌బాబా పాల్గొన్నారు.



ఖాజీరామారం గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మాడ్గులపల్లి: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మాడ్గులపల్లి మండల కేంద్రంలో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మర్రిగూడెం నల్లకుంట చెరువుకి తన సొంత ఖర్చులతో రెండు మోటార్లను ఇచ్చి ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్లెంల సైదులు, మండలాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తిప్పర్తి: తిప్పర్తిలో అంబేడ్కర్ పార్కు అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని మంత్రి కోమటిరెడ్డి అధికారును ఆదేశించారు. మాడ్గులపల్లి మండల పర్యటన ముగించుకొని తిప్పర్తిలో సోమవారం కొద్దిసేపు ఆగారు. పనుల పురోగతిపై అధికారులు, నాయకులతో కలిసి చర్చించారు.

సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా ర్యాలీ



పెద్దకాపర్తిలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దకాపర్తి, రామన్నపేట శివారులో ఏర్పాటు చేయనున్న సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సోమవారం పెద్దకాపర్తి గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనారోగ్యాలకు, పంట పొలాలను నాశనం చేసే కాలుష్య కారక పరిశ్రమకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకూడదని పేర్కొంటూ నిరసన తెలిపారు. ఈనెల 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని పేర్కొన్నారు. మర్రి జలేందర్‌రెడ్డి, గణేశ్, రమణారెడ్డి, జానయ్య, లింగస్వామి, యాదగిరి, నాగరాజు, విష్ణు, తిరుమలేశ్ పాల్గొన్నారు.

తేమ శాతం 12 దాటొద్దు



మునుగోడులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీ కార్తికేయ కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారంగా రైతులు తమ పత్తిని 12 తేమశాతం దాటకుండా తెచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, మాజీ ఎంపీపీలు కర్నాటి స్వామి, సత్యం, అంజయ్య పాల్గొన్నారు.

చిట్యాల గ్రామీణం: చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. నేరడ, ఎలికట్ట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు ఏసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు.

విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్, న్యూస్‌టుడే: నల్గొండ ఎన్జీ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో నకిరేకల్ ఏవీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. కబడ్డీ అండర్-14 బాలికల విభాగంలో వి.తేజశ్రీ, వి.నిత్యశ్రీ, ఎన్.నిఖిత, బాలుర విభాగంలో ఎం.చరణ్, కె.జగదీశ్, పి.రామచంద్ర, జె.కృష్ణుడు, వి.సాయిచరణ్, అండర్-17 బాలుర విభాగంలో ఎం.ప్రణయ్ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ కె.స్వప్నారెడ్డి తెలిపారు. విద్యార్థులను ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి సోమవారం అభినందించారని వివరించారు. పీడీ ఎన్.శంకర్, ఏవో శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్గొండ క్రీడావిభాగం: నల్గొండ పట్టణం డీవీకే రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు సిమోన్ జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు, సిద్దు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు ఇటీవల నల్గొండ ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన డివిజన్‌స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి త్వరలో జరిగే జిల్లా పోటీలకు అర్హత సాధించారు. వీరిని సోమవారం కళాశాల డైరెక్టర్ నాగేశ్వర్‌రావు అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు యాదయ్య, త్రిమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీ రాంబాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో



నల్గొండ పరిధిలోని దోమలపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి పేర్కొన్నారు. సోమవారం నల్గొండ పరిధిలోని దోమలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షలను పర్యవేక్షించారు. పదోతరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం పాఠశాలలో పాత భవనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంఈవో కె.అరుంధతి, హెచ్‌ఎం కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిరస్మరణీయం .. అమరవీరుల త్యాగం



మాట్లాడుతున్న నల్గొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థినులు ఉన్నత చదువులు పూర్తిచేసి పోలీస్‌శాఖలో కానిస్టేబుల్ నుంచి ఎస్పీస్థాయి వరకు కొలువులు సాధించాలని నల్గొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నల్గొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అమరవీరుల త్యాగం ఆదర్శమని తెలిపారు. ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కట్టంగూరు: అయిటిపాముల పరిధి రసూలుగూడెంకు చెందిన కానిస్టేబుల్ చెవుగోని నాగరాజు విగ్రహానికి ఎస్సై రవీందర్ సోమవారం నివాళి అర్పించారు.

5కే రన్‌లో ప్రథమ బహుమతి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి 5కే రన్ కార్యక్రమంలో నల్గొండ ఎన్జీ కళాశాల విద్యార్థి ధనుష్ ప్రథమ బహుమతి సాధించాడు. ఆ విద్యార్థినిని సోమవారం కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్ అభినందించారు. విద్యార్థి సాధించిన పతకం, రూ.35వేల నగదు ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శమని తెలిపారు. కళాశాల అకడమిక్ కో ఆర్డినేటర్ పరంగి రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ సురేశ్‌బాబు, సీవోఈ బి.నాగరాజు, మల్లేశ్, అనిల్, శ్రీధర్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



ధనుష్‌ను అభినందిస్తున్న ఎన్జీ కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, అధ్యాపకులు

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నకిరేకల్, న్యూస్‌టుడే: గోరెంకలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకంఠమహేశ్వరస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం నిర్వహించారు. జలబిందెలు, బోనాల సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తండు సైదులుగౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, మాజీ ఛైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి వీరార్జున్‌రెడ్డి, జాజుల నాగయ్య, కొండయ్య తదితరులు వేరువేరుగా పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష గోడపత్రిక విడుదల

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, డీఏ, పీఆర్‌సీలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణ ఉపాధ్యాయ ధర్మాగ్రహదీక్ష గోడపత్రికను నల్గొండలో విడుదల చేశారు. స్థానిక టీపీయూఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అలుగుపల్లి పాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ గోడపత్రిక విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 22న పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, 28న తహసీల్దార్‌లకు వినతిపత్రాలు, నవంబరు 5న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా, 23న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షను ఇందిరాపార్కు వద్ద నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాజశేఖర్, మిర్యాల మురళి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** .విశ్వం, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్: **రామకృష్ణ-** విశ్వం, **వెంకటేశ్వర-** దేవర

అవీ ఇవీ

సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ... మర్రిగూడ: మండల పరిధిలోని కుదబక్షుపల్లి గ్రామ ఆవాస ప్రాంతం సాయిబండ తండాలో గిరిజనుల ఆరాధ్యదైవం మేరమ్మ మాడి సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ప్రత్యేక పూజలు మధ్య నిర్వహించారు. వేద పండితుల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఏర్పాటు చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాశం సురేందర్‌రెడ్డి హాజరై దేవాలయ నిర్మాణం కోసం రూ.2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. లక్ష్మానాయక్, పాండునాయక్, విష్ణు, సుధాకర, శ్రీను, పందుల పాండు, జగన్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు... నార్కట్‌పల్లి గ్రామీణ: గోపలాయపల్లిలోని శ్రీవారిజాల వేణుగోపాలస్వామి గుట్టపైన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీకాంత్ శివలక్ష్మి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

చెక్కుల పంపిణీ... చండూరు: మండల పరిధిలోని 12 గ్రామాల్లోని 22 మందికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.5.51లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొరిమి ఓంకారం సోమవారం ఆయా లబ్ధిదారులకు అందజేశారు. ఇరిగిరాజు, వెంకట్‌రెడ్డి, రాములు, వెంకటయ్య, యాదయ్య ఉన్నారు.

ఎన్నిక... మర్రిగూడ: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కో కన్వీనర్‌గా మండల పరిధిలోని చర్లగూడెం గ్రామానికి చెందిన నాగిళ్ల మారయ్యను ఎన్నుకున్నారు. మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన ఓ సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని ఆ సంఘం జిల్లా ఛైర్మన్ మధుబాబు అందజేశారు.

నార్కట్‌పల్లి గ్రామీణం: జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీగా బ్రాహ్మణవెల్లంలకు చెందిన చిరుమర్తి ఉపేందర్ నియమితులయ్యారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతులమీదగా నియామకపత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉశయ్యగౌడ్, భూపాల్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి గ్రామీణం: నార్కట్‌పల్లిలోని సన్‌షైన్ అవెన్యూ కాలనీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పు రాము, ఉపాధ్యక్షుడిగా లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, కోశాధికారిగా జి.శివకుమార్‌లను ఎన్నుకున్నారు.

ఆశ్రమానికి అప్పగింత ... చిట్యాల: చిట్యాలలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వృద్ధుడిని ఆసరా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని అమ్మానాన్న ఆశ్రమంలో చేర్పించారు. చిట్యాల ఎస్సై ఎన్.ధర్మా సహకారంతో ఆశ్రమ నిర్వాహకుడు గట్టు శంకర్‌ను సంప్రదించి వృద్ధుడిని అందులో చేర్పించామని హరికృష్ణ పేర్కొన్నారు.

మృతికి నివాళి... చిట్యాల గ్రామీణం: మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు అక్కెనపల్లి అమృతయ్య(66) అనారోగ్యంతో మృతి చెందారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్యలు సోమవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి శ్రీనివాస్, శ్యాంసుందర్, నర్సింహ, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి... కట్టంగూరు: విద్యుదాఘాతంతో గేదెలు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కట్టంగూరుకు చెందిన ముదిరెడ్డి భద్రమ్మ సోమవారం పాత బీసీ వసతిగృహం సమీపంలో తన రెండు గేదెలను మేపేందుకు తీసుకువెళ్లగా, తెగి కింద పడిన విద్యుత్ తీగ తగిలి రెండు గేదెలు మృతిచెందాయి. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు వాపోయింది.

సాయం అందజేత ... కట్టంగూరు: కురుమర్తి గ్రామానికి చెందిన సి.నరేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన స్నేహితులు, గ్రామస్థులు కలిసి నరేష్ కుటుంబ సభ్యులకు రూ.58 వేలు అందజేశారు. శ్రీను, సురేష్, ఒంగూరి అంజయ్య పాల్గొన్నారు.

చిట్యాల గ్రామీణం: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన మేడి సాయమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా కాంగ్రెస్ నాయకుడు అంతటి నర్సింహగౌడ్ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం... నారాయణగూడ: తెలంగాణ ఎస్సీ ఎస్టీ, ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్ సంఘం నల్గొండకు చెందిన సీహెచ్ పవన్‌తేజ్‌కు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చినా ఆర్థిక పరిస్థితుల కారణంగా హాస్టల్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారు. సంఘం అధ్యక్షుడు గయక్వాడ్ తులసీదాస్ మాంగ్ వైద్య విద్యార్థికి రూ.25 వేల చెక్కు అందజేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎస్పీ

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండడమే కాక.. ప్రతి ఫిర్యాదుకు పరిష్కార మార్గం చూపాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సోమవారం పోలీస్ కార్యాలయానికి వచ్చిన బాధితుల నుంచి 25 ఫిర్యాదులు స్వీకరించారు. కొన్ని సమస్యలను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరిచి పరిష్కారం అయ్యే వరకు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై నాగరాజు తెలిపారు. సుమారు 35 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతి చెందడంతో ఆసుపత్రి సిబ్బంది సమాచారంతో మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు 87126 70176 నంబరును సంప్రదించాలని కోరారు.

విశ్రాంత ఎస్సై మృతికి సంతాపం

కేతేపల్లి, న్యూస్‌టుడే: కేతేపల్లికి చెందిన విశ్రాంత ఎస్సై అల్లుబెల్లి జగన్ మోహన్‌రెడ్డి మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోట మల్లికార్జున్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ ఏళ్ల అశోక్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

మిర్యాలగూడ
• మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ

చర్యలు తీసుకోవాలని వినతి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: గత ఆర్డీవో సంతకాన్ని ఫోర్జరీ చేసి దామరచర్ల మండలంలోని వైటీపీఎస్ భూ నిర్వాసితుల పేరిట రూ.లక్షల విలువైన చెక్కుల డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందించారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ. . దీనిపై పోలీసులకు ఫిర్యాదు సైతం చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. కాశీ, భరత్, కిరణ్, సైదమ్మ, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎఫ్ నాయకుడు

దరఖాస్తు చేసుకోవాలి

దామరచర్ల: మండలంలోని బొత్తలపాలెం ఆదర్శపాఠశాలలో ఖాళీగా ఉన్న సివిక్స్ ఉపాధ్యాయ పోస్టుకు అర్హుల నుంచి ఈ నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ పోతురాజు నరహరి సోమవారం తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగానికి ఎంఏ సివిక్స్‌తో పాటు బీఈడీ విద్యనభ్యసించి ఉండాలని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని శాంతినగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాల పక్క వీధిలో రోడ్డుపై వ్యర్థాలు భారీగా పెరిగిపోయాయి.
– తరుణ్, మిర్యాలగూడ

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

వాటర్ ట్యాంకుతండాకు తప్పని కష్టాలు


మిర్యాలగూడ పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ఫిల్టర్ బెడ్ ట్యాంకు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పట్టణానికి తాగునీటి సరఫరా చేసేందుకు మండలంలోని 'వాటర్‌ట్యాంకు తండా'లో ఫిల్టర్‌బెడ్ ఏర్పాటు చేయగా ట్యాంకు తండా వాసులకు తాగునీటి కష్టాలు తప్పటం లేదు. పట్టణానికి 30 ఏళ్ల క్రితం కృష్ణామంచినీటి పథకం ఏర్పాటు సమయంలో ట్యాంకుతండాకు చెందిన రైతుల భూముల నుంచి పైపులైన్లు వేసేటప్పుడు తండా వాసులకు రెండు తాగునీటి నల్లాలు పురపాలిక ఏర్పాటు చేసింది. 2002లో కృష్ణామంచినీటి పథకం-2 ఏర్పాటు చేసిన సమయంలో మరోసారి తండా రైతుల భూముల నుంచి పైపులైన్లు వస్తుండగా మరో మూడు వీధి నల్లాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఐదు వీధినల్లాలు కొంత కాలం పనిచేయగా తండా వాసులు ఈ నీటిని వినియోగించుకుంటున్నారు. కొవిడ్ సమయంలో ప్రధాన పైపులైను తెగిపోగా వీధి నల్లాలకు నీరు నిలిపివేశారు. అప్పటి నుంచి పలుమార్లు తండావాసులు తాగునీటి నల్లాల మరమ్మతులకు పురపాలిక అధికారులను, ప్రజాప్రతినిధులను సంప్రదించినా ప్రయోజనంలేదు. ప్రస్తుతం ఫిల్టర్‌బెడ్ బయట ఉన్న ఒకే నల్లా నుంచి తండావాసులు మొత్తం నీటిని తీసుకెళ్లాల్సి వస్తుండగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపున ఈ నల్లా వద్దకు చిల్లాపురం, రాఘవపురం, గుగులోతుతండా, మైసమ్మకుంట తండా, రవీంద్రనగర్, భగ్యాగోపసముద్రం తండా వాసులు వస్తుండగా నిత్యం రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్లు మరమ్మతులు చేసి ఐదునల్లాలు పునరుద్ధరించాలని తండా వాసులు కోరుతున్నారు.


నిరుపయోగంగా నల్లాలు

ఈ వంతెనపై ప్రయాణం.. ప్రమాదకరం



హాలియా, న్యూస్‌టుడే: హాలియాలోని దేవరకొండ రోడ్డులో పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎడమకాలువ పైవంతెన మీద ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రెండేళ్ల క్రితం కోదాడ-జడ్చర్ల 167 జాతీయ రహదారి విస్తరణ పనుల సమయంలో ఈ వంతెన పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికి ఇప్పటి వరకూ ఆ పనులు ముందుకు కదలటంలేదు. దీంతో ఈ మార్గం గుండా హైదరాబాద్ నుంచి కర్నూల్ నుంచి విజయవాడ, గుంటూరుకు ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన వంతెన కావడం.. కాలువలో నీటి ప్రవాహం ఉధృతిగా ఉండటంతో ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్న స్థానిక పాఠశాలలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గుత్తేదారు మాత్రం నామమాత్రంగా వంతెనపై గుంతలు పూడ్చి కాలయాపన చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. నూతన వంతెన నిర్మాణం కోసం రూ.156 లక్షల నిధులు మంజూరు కాగా గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా పనులు చేపట్టలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎడమకాలువకు నీటి విడుదల కావడంతో పనులు చేపట్టలేదని అధికారులు దాటవేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు.

సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం పర్యటన

దేవరకొండ, న్యూస్‌టుడే: శిక్షణలో భాగంగా ఐఏఎస్‌లు సోమవారం దేవరకొండ మండలం కర్నాటిపల్లి గ్రామానికి చేరుకున్నారు. నాలుగు రోజుల పాటు గ్రామంలో ఉంటూ గ్రామపంచాయతి పాలనపై అవగాహనలో భాగంగా గ్రామానికి వచ్చినట్లు దేవరకొండ ఎంపీడీవో డానియల్ తెలిపారు. కర్నాటిపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఇంట్లో నాలుగు రోజుల పాటు బస చేస్తారు. ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతి కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


జర్పులతండాలో శిక్షణ ఐఏఎస్ అధికారులకు స్వాగతం పలుకుతున్న అధికారులు

చింతపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకొని అధ్యయనం చేసేందుకు సివిల్ సర్వీసెస్ (శిక్షణ ఐఏఎస్)అధికారుల బృందం మండలంలోని జర్పులతండాలో పర్యటించారు. డా.మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు గ్రామంలో అధ్యయం చేస్తారు. ఐదుగురు సభ్యుల బృందం గ్రామంలో అమలు అవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామానికి సంబంధించి సమాచారం సేకరించారు. శిక్షణ ఏఐఎస్ అధికారుల బృందానికి మండల అధికారులు స్వాగతం పలికి సన్మానించారు. ఎంపీడీవో సుజాత, ఏపీఎం విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు కవిత, నగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం నిర్మాణానికే
ప్రజాపాలన: బీఎల్ఆర్

వేములపల్లి, న్యూస్‌టుడే: సత్వర ప్రజా సమస్యల పరిష్కారం చేపట్టే ఇందిరమ్మ రాజ్యం నిర్మించడానికే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమానికి పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని తిరుమలగిరిసాగర్ మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని సర్వే చేపట్టగా సుమారు 1,200 ఎకరాల భూమి సాగు లేకున్నా దొంగ పాస్ పుస్తకాలతో రైతుబంధు సొమ్ము గత ప్రభుత్వం దోచుకుందన్నారు. ఇలాంటి పొరపాటు కాంగ్రెస్ పాలనలో ఉండకూడదనే రైతుభరోసా విషయంలో కమిటీని వేసి విధివిధానాలను అనుగుణంగా వ్యవస్థలో ఉన్న ప్రతి రైతుకు భరోసా అందిస్తామన్నారు. అనంతరం సల్కునూరు గ్రామంలో పీఏసీఎస్ కేంద్రంలో నాబార్డ్ నిధులు రూ.24.33 లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో శారదాదేవి, తహసీల్దార్ సాదత్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, టీపీసీసీ మెంబర్ కృష్ణయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జున్, మండల పార్టీ అధ్యక్షులు కాంతారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ స్పృధర్ రెడ్డి, కృపయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే

చింతపల్లి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కుర్మేడ్, చింతపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఇచ్చిన అనంతరం అర్హులైన రైతులకు ఎకరానికి రూ.7,500 అందిస్తామని అన్నారు. వచ్చే సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పీఏసీఎస్ ఛైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, దొంతం సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: కొత్త వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. సోమవారం దేవరకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ మొదటి పాలకవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు, రైతులకు ఎప్పటికప్పుడు వివరించాలని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా మార్కెట్‌లో అనేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్ నాయిని జమున, పురపాలిక సంఘం ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ ఛైర్మన్ జాల నర్సింహారెడ్డి, తదితరులున్నారు.


పెర్వాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట: మండలంలోని ప్రతి గింజను కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం పెర్వాల గ్రామంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం, దేవరచర్ల గ్రామంలో దశదిన కర్మకు హాజరయ్యారు. ధాన్యం కొనుగోలులో రైతులను మోసాలకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. నాణ్యత లోపం పేరుతో రైతులు ఇబ్బందులు పెట్టవద్దని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకెళ్తుందన్నారు. అనంతరం దేవరచర్ల గ్రామంలో కేతావత్ లక్ష్మా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తిమ్మాపురం, చిత్రియాల సొసైటీ వైస్ ఛైర్మన్ శ్రీశైలం యాదవ్, నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, నాయకులు లోకసాని కృష్ణయ్య, బిక్క్యానాయక్, యుగేందర్‌రెడ్డి, వెంకటయ్య, సర్పయ్య, పార్వతి, గడ్డం వెంకటయ్య ఉన్నారు.

కల్యాణలక్ష్మి నిరుపేదలకు వరం..

చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలని అన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకాంతశర్మ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు, పీఏసీఎస్ ఛైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, డీసీసీ ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, జిల్లా కార్యదర్శి ఎరుకుల వెంకటయ్యగౌడ్, కొండూరి పవన్, కాయితీ జితేందర్‌రెడ్డి, గుండ్లపల్లి నర్సింహారెడ్డి, హరినాయక్, దాసరి శ్రీను పాల్గొన్నారు.

'మోదీ నాయకత్వంలో అభివృద్ధి'

చింతపల్లి, న్యూస్‌టుడే: కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలూనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో భాజపా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నమో స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో వేగవంతం చేయాలని అన్నారు. భాజపా మండల అధ్యక్షుడు రమేష్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి శేఖర్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి అభినవ్ పాల్గొన్నారు.


చింతపల్లిలో భాజపా ఆధ్వర్యంలో నమో స్టాల్‌ను ప్రారంభించిన లాలునాయక్

డిండి,: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ భాజపా సభ్యత్వం తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ అన్నారు. డిండిలో భాజపా సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటీ కృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రాధిక, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పోలీసు అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. సమాజంలో శాంతి, భద్రతలు కాపాడడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. ఉమామహేశ్వర్, తాళ్ల సురేష్, భాస్కర్‌రెడ్డి, వేముల రాజు, కరాటే మాస్టర్ శ్రీను, అమర్ తదితరులున్నారు.


దేవరకొండలో పోలీసు అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న ఆ సంఘం సభ్యులు

ప్రజా ఉద్యమాలతోనే పార్టీ బలోపేతం: జూలకంటి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ఉద్యమించడం ద్వారానే పార్టీ క్షేత్ర స్థాయిలో బలోపేతమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. డిసెంబర్ 3, 4 తేదీల్లో మిర్యాలగూడలో నిర్వహించనున్న పార్టీ జిల్లా మహాసభల సందర్భంగా సోమవారం స్థానికంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ విస్తృత ప్రచారం నిర్వహించి.. ప్రస్తుత రోజుల్లో ఎర్రజెండా అవసరాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రమీల, శ్రీశైలం, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, జగదీశ్చంద్ర, రవినాయక్, మంగారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నేలకొరిగిన పంట పొలాలు.. ఆందోళనలో రైతులు

త్రిపురారం, న్యూస్‌టుడే: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలోనే ఆకాల వర్షాలతో నేలకొరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తరచూ కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని ఆయకట్టేతర ప్రాంతాల్లో బోరు, బావుల కింద ముందస్తుగా సాగు చేసిన పొలాలు పది రోజుల్లో కోతకు సిద్ధమయ్యాయి. అలాంటి క్రమంలో మండలంలోని దుగ్గేపల్లి, కామారెడ్డిగూడెం, కొణతాలపల్లి, కంపాలపల్లి, అన్నారం తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో కోతకు వచ్చిన పొలాలు నేల కొరిగాయి. దీంతో రైతులకు అదనపు భారం పడుతుంది. మరో రెండు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణశాఖ తెలియజేయడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. నేలకొరిగిన పంట పొలాలను వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.


దుగ్గేపల్లిలో నేలవాలిన పొలం

క్రీడా ప్రాంగణం.. పశువుల నిలయం





తెలంగాణలో గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు చేయూత అందించడానికి ప్రతి గ్రామపంచాయతీలో రూ.5 లక్షల నిధులతో క్రీడాప్రాంగణాలు నిర్మించారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. కొన్ని బోర్డులు మాత్రమే దర్శనం ఇవ్వగా మరొక చోట ఆట వస్తువులు లేకపోవడంతో లక్ష్యం నీరుగారింది. అనుముల మండలం రామడుగు గ్రామంలోని క్రీడాప్రాంగణం పశువుల దొడ్డిగా మారిందిలా.
– న్యూస్‌టుడే, హాలియా

వ్యర్థాలు.. పట్టించుకోని అధికారులు

చింతపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో వ్యాపారులు నిత్యం వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని వదిలేస్తున్నారు. మండల కేంద్రం నుంచి వర్కాల గ్రామానికి వెళ్లే బీటీ రహదారికి నిత్యం రాత్రి సమయంలో వ్యాపారులు వ్యర్థాలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. దీంతో పందులు, శునకాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. కళాశాలకు వెళ్లే అధ్యాపకులు, విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయింది. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ తెలిపారు.


చింతపల్లిలోని ప్రభుత్వ కళాశాల పక్కనే వదిలేసిన వ్యర్థాలు

కారు, బైక్ ఢీ
యువకుడు దుర్మరణం

వంగూరు, న్యూస్‌టుడే: మండలంలోని తిర్మలగిరి వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్‌ను వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రానికి చెందిన బుచ్చాచారి (27) శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిపై తిర్మలగిరి స్టేజి వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో ఆదివారం రాత్రి తన బైక్‌లో పెట్రోల్ పోసుకొని తిరిగి డిండి వస్తున్నాడు. అచ్చంపేట నుంచి అతివేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. కారును స్వాధీనం చేసుకొని మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుచ్చాచారికి భార్య నాగమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కళాశాల ఆవరణం.. మందుబాబులకు నివాసం

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. దేవాలయంగా చూడాల్సిన విద్యాలయ ఆవరణాన్ని మందుబాబులు అపవిత్రం చేస్తున్నారు. హిల్‌కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థాపించి సుమారు 50 ఏళ్లు అవుతుంది. మొదట్లో కళాశాలకు అవసరమైన రాత్రి కపలాదారులు, ఇతర సిబ్బందిని విద్యాశాఖ నియమించింది. ఇటీవల ఇక్కడ రాత్రి కపలాదారుల పోస్టులను రద్దు చేయడంతో ఈ ప్రాంతానికి ఎవరు వస్తున్నారు, ఏం చేస్తున్నారన్నది పరిశీలన లేకుండా పోయింది. ముఖ్యంగా కళాశాల ఆవరణతో పాటు ఈ ప్రాంతంలోని వీధిదీపాలు పనిచేయకపోవడంతో మందుబాబులకు ఇష్టారాజ్యంగా మారింది. మద్యంతో పాటు గంజాయి దందా సాగుతున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో ఇలాంటి పరిస్థితులు ఉండడంతో ఈ దారిన వెళ్లాలంటేనే మహిళలు భయపడుతున్నారు. ఈ విషయమై జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంఘటనల విషయం దృష్టికి వచ్చిందని.. ఇలాంటి దురాచారాలను జరుగకుండ తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వారి సూచన మేరకు సీసీ కెమరాను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.



సాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల


మందుబాబులు వదిలేసిన మద్యం సీసాలు

ఆగని ప్రత్యేక బాదుడు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దసరా పండగ అయిపోయి 10 రోజులు అయింది. ఆర్టీసీలో ముందుగా ప్రకటించిన ప్రత్యేక బస్సుల ప్రణాళిక ముగిసి ఐదు రోజులు గడుస్తుంది. అయినా ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యేకం పేరుతో అదనపు వసూళ్లు మాత్రం ఆగడం లేదు. సోమవారం ప్రయాణికుల రద్దీని సొమ్ము చేసుకునేందుకు మిర్యాలగూడ డిపోలో ప్రత్యేక బస్సులు నడిపారు. వీటిలో 50శాతం అదనపు ఛార్జీ వసూలు చేశారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు సూపర్‌లగ్జరీ బస్సు ఛార్జీ సాధారణంగా రూ.290 ఉండగా.. ప్రత్యేకం పేరుతో రూ.400 వసూలు చేస్తున్నారు. మరో వైపు హైదరాబాద్‌కు రాజధాని ఏసీ బస్సు ఛార్జీ మాత్రం రూ.370 వసూలు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు టికెట్‌పై అదే బస్సు నంబర్ ముద్రించాల్సి ఉండగా.. ఇతర బస్సు నంబర్ ముద్రించి టిక్కెట్లు కొడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండడంతో రెండు అదనపు బస్సులు నడపగా.. వీటిలో మాత్రమే అదనపు ఛార్జీ వసూలు చేసినట్లు డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.



మిర్యాలగూడ-హైదరాబాద్ సూపర్ లగ్జరీ రూ.400 ఛార్జీతో టికెట్

సినిమాలు మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్
విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక

అవీ ఇవీ

విజయవంతం చేయాలి... కొండమల్లేపల్లి: మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఉట్కూరి వేమల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేసు నమోదు.. గుర్రంపోడు: మొసంగి గ్రామానికి చెందిన భార్యాభర్తలు పురుగుమందు తాగిన ఘటనపై వారి కుమారుడు రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మద్యానికి డబ్బులు ఇవ్వాలంటూ భార్య జ్యోతితో గొడవపెట్టుకుని క్షణికావేశంలో తమ తల్లిదండ్రులు పురుగు మందు తాగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: వివిధ మరమ్మతుల కారణంగా మిర్యాలగూడలోని సాగర్ రహదారిలోని రెడ్డికాలనీ రామాలయం ఆర్చీ నుంచి చెన్నయ్ షాపింగ్ మాల్ మీదుగా ఎల్ఐసీ కార్యాలయం వరకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు రెండో పట్టణ ఏఈ రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నియామకం.. మిర్యాలగూడ పట్టణం: చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మీడియా కార్యదర్శిగా మిర్యాలగూడకు చెందిన రావిరాల శ్రీనివాస్ నియమితులయ్యారు. సోమవారం స్థానికంగా మాట్లాడుతూ.. చేనేత సమస్యలపై తన వంతు కృషి చేస్తానని.. తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


రావిరాల శ్రీనివాస్

ప్రాణాలు నిలిపిన వైద్యుడికి సత్కారం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: అత్యవసర సమయంలో వైద్య చికిత్స అందించి ప్రాణాలు నిలిపిన వైద్యుడిని బాధితుడితో పాటు కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించిన ఉదంతమిది. వివరాల్లోకి వెళ్తే.. మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన రామచంద్రారెడ్డికి నెల రోజుల క్రితం అర్ధరాత్రి మెదడులో రక్తం గడ్డ కట్టుకుపోయి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని పలు ఆసుపత్రులకు తీసుకెళ్లగా ఎవరూ చేర్చుకోలేదు. ఈ క్రమంలో డాక్టర్ బాలాజీ ముందుకొచ్చి రెండు గంటల పాటు చికిత్స అందించాడు. అనంతరం హైదరాబాద్‌కు తరలించగా.. గోల్డెన్ అవర్‌లో చికిత్సతో ప్రాణాపాయం తప్పినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం కోలుకున్న రామచంద్రారెడ్డి.. సోమవారం తన భార్య సుజాతతో కలిసి డాక్టర్ బాలాజీని కలిసి ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. వారి వెంట కాంగ్రెస్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సలీం తదితరులు ఉన్నారు.


డాక్టర్ బాలాజీని సత్కరిస్తున్న రామచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు

అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే సమాజంలో వారికి మంచి గుర్తింపు లభిస్తుందని పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు ఏరుకొండ అంజయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో బదిలీపై వెళ్లిన ఎంఈవో మాత్రునాయక్, నూతన బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరరావుకు పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్ ఉపాధ్యాయుల చేతిలోనే ఉందని తెలిపారు. అనంతరం ఎమ్మార్సీ భవనంలో కంప్యూటర్, ఇతర సామగ్రి కొనుగోలుకు సహకరించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఏరుకొండ అంజయ్య, వాసికార్ల రమేష్, సంజీవ్‌కుమార్, సైదులు, కట్టబోయిన శ్రీనివాస్‌యాదవ్, నీల ఉదయశ్రీ, శోభారాణి, మేకల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, మోహన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కొత్త, పాత ఎంఈవోలతో ఉపాధ్యాయులు